

# యండమూరి కథాస్రవంతి

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



# నీకస్సలు బుద్ధుందా?

"నేను మెడిసినూ, ఐ.ఐ.టీ చదవను. బి.ఏ. సైకాలజీ చదువుతాను"

"నీకస్సలు బుద్ధుందా? బి.ఏ. చదువుతావా? మెడిసిన్ గానీ, ఐ.ఐ.టి గానీ చదివితే పేరుకి పేరు, డబ్బుకి డబ్బు" నాగేశ్వరరావు కోపంగా, విసుగ్గా అన్నాడు.

సుమద్యుతి తలెత్తి తండ్రి వైపు ఓ క్షణం చూసి తల దించుకుంది.

"ఏం మాట్లాడవేం?"

"ఆలోచిస్తున్నాను"

"గుడ్..! తీరిగ్గా ఆలోచిస్తే పెద్దలు ఎందుకు చెప్తున్నారో అర్థం అవుతుంది."

"నేను ఆలోచిస్తున్నది అది కాదు నాన్నా. 'నీకస్సలు బుద్ధుందా' అన్న మాట నాకు ఊహ వచ్చినప్పటి నుంచీ అమ్మతో ఎన్నిసార్లు అని ఉంటావా? అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడీ రోజు నాక్కూడా బుద్ధి లేదన్న నిర్ణయానికి వచ్చేసావు."

షాక్ తగిలినట్టు కూతురి వైపు చూసాడు రావు. మొన్నటి వరకూ చెడ్డీలు వేసుకు తిరిగిన కూతురు ఈ రోజు ఇలా వాదిస్తూ ఉంటే అతడికి ఏం మాట్లాడాలో తెలియలేదు. దూరంగా ఓ మూల తల దించుకుని ఫోన్ తుడుస్తూ ఈ సంభాషణ అంతా వింటూన్న భార్య వైపు చూసాడు. ఆమె పెదాల మీద నవ్వు కదులుతున్నట్టు అనుమానం వచ్చింది. సంభాషణ మారుస్తూ, "సర్లే. ఇదంతా తరువాత మాట్లాడుకుందాం. తయారవ్వు. ఫ్లయిట్ కి టైమయింది" అన్నాడు.

\+ \+ \+

ఘాట్ రోడ్ మీద కారు బాగ్‌డోగ్రా విమానాశ్రయానికి వెళ్తోంది. డార్జిలింగ్ టీ తోటల మధ్య నుంచి దూరంగా కాంచనగంగ శిఖరం ఎత్తుగా కనపడుతోంది. ఓక్ చెట్లు, పక్కనే ఆర్కిడ్స్ పూలు... వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంది. ఆమె దాన్ని ఆస్వాదిస్తూ ఉండగా, "హైదరాబాదు ఎయిర్-పోర్ట్ లో నిన్ను రిసీవ్ చేసుకోవటానికి మన మేనేజర్ని కి పంపుతానంటే "ట్రిప్ లో థ్రిల్ ఉండదు, వద్ద"న్నావ్. నీ మాట నీదే కానీ నాది ఎప్పుడు విన్నావ్ కనుక? విమానం దిగ్గానే జాగ్రత్తగా సికింద్రాబాదు స్టేషన్ కి వెళ్ళు. నర్సాపూర్ ట్రెయిన్ గుర్తుంచుకో. నువ్వు వెళ్ళే ప్లేస్ ని కోనసీమ అంటారు. ఏం అవసరం వచ్చినా ఫోన్ చెయ్యి. అడ్వంచర్లు ఏమీ చెయ్యకు".

"డార్జిలింగ్ అన్న పేరు బ్రిటీషువాళ్ళు పెట్టారా?" అని అడిగింది.

"కాదు. డోర్జీ అంటే నేపాలీలో పర్వతాల్ని ఏలే దేవుడు... శివుడు".

"శివుడి లింగం డార్జిలింగం అయ్యిందన్నమాట" అంటూ నవ్వింది.

అతడు చిరాగ్గా, "నేనేదో చెప్తూంటే నువ్వేదో అడుగుతావేమిటి?" అన్నాడు.

అమె కారు దిగి బ్యాగ్ అందుకుంటూ, "నీ పెట్టెలో మందులు సర్దుతూ ఇవే జాగ్రత్తలూ అమ్మ చెప్తూంటే నువ్వేమంటావ్ నాన్నా? 'ప్రయాణాలు నాకు కొత్త కాదు. కొత్త కోడలికి చెప్పినట్టు అన్ని సార్లు చెప్పనవసరం లేదు' అని విసుక్కుంటావు. మరి ఇప్పుడు అవే మాటలు నాకు ఎందుకు చెప్తున్నావు?" అంటూ ఓ క్షణం ఆగి పూర్తి చేసింది. "...అది జాగ్రత్తలు చెప్పటం కాదు నాన్నా. నా మీద నీకున్న ప్రేమ..! అవునా..! అదే ప్రేమ అమ్మకీ నీ మీద ఉన్నది. అందుకే జాగ్రత్తలు చెపుతోంది. వెళ్లొస్తాను. బై" అంది.

★★★

ఏ.సి. కంపార్ట్‌మెంటులో కూర్చున్నా ఆదిత్యకి విసుగ్గా ఉంది. అది భయమూ, టెన్షనూ కాదు. ఏదో తెలియని ఇబ్బంది. ఫోన్ చేసి, "మావయ్యా. మీ ఊరు వచ్చేస్తున్నాను. అక్కడి నుంచే ఉద్యోగాలు వెతుక్కుంటాను" అన్నాడు.

"రావోయ్ రా. యు ఆర్ ఆల్వేస్ వెల్-కమ్"

"తిరిగి హైదరాబాదు వెళ్ళను" అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ చప్పున ఆగిపోయాడు. ముందు ఒక రకమైన సిగరెట్టు వాసన వచ్చింది. ఎవరో తనలాంటి కుర్రాడు వస్తున్నాడేమో అనుకుంటూ ఉండగా, ఓ పదహారేళ్ళ అమ్మాయి స్లయిడ్-డోర్ పక్కకి జరుపుతూ హడావుడిగా లోపలి ప్రవేశించింది. 'ఎక్కేసాను నాన్నా...' అంటూ కాబిన్ లోకి వచ్చి ఎదుటి బర్త్ మీద కూర్చుంది. తెల్లటి పాల మీద ఎర్రగా కట్టిన మీగడలా ఉంది. జీన్స్ ప్యాంట్ లోకి షర్టు దోపింది. పై బటన్ పెట్టుకోలేదు. లోపల బ్రా లేదు. చేతులు దగ్గరగా పెట్టుకోవటంతో, భుజాలు మరింత దగ్గరగా అయి, మెడ క్రింద గీత లోతుగా కనపడుతోంది. అతడిని చూసి "హాయ్" అంది. ఆ పలకరింపు ఊహించని అతను తడబడి "హలో" అన్నాడు. ట్రయిన్ కదిలింది.

"మైగాడ్. ఇంకో నిముషం లేట్ అయివుంటే రైలు మిస్సయ్యేదాన్ని. ఫ్లయిట్ 'ల్యాండ్' అవటం ఆలస్యం అయిందన్నా వినకుండా నాన్న క్లాసు పీకేవాడు. బైదిబై నా పేరు సుమద్యుతి. డార్జిలింగ్ నుంచి వస్తున్నాను. మీరు?" చక చకా చెప్పేసి చెయ్యి అందిస్తూ అన్నది.

షేక్ హ్యాండ్ ఇస్తూ, "నా పేరు ఆదిత్య. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్. మీరు... ద్యుతి... అంటే?" అని అడిగాడు.

"ద్యుతి అంటే కాంతి. సుమద్యుతి అంటే పూల కాంతి. పూలకి కాంతి ఏమిటి అని అడక్కండి. వెరైటీ అని అమ్మ పెట్టింది. సుమద్యుతి అనేది ఒక రాగం."

"మీరు ఎక్కడి వరకూ?"

"నరసాపురం. అక్కడి నుంచి ఎదుర్లంక" అన్నది.

"ఓ మై. నేనూ అక్కడికే. ఎదుర్లంక వెళ్ళటం కోసం నర్సాపురం వరకూ ఎందుకు? పాలకొల్లులో దిగిపోండి."

"మా నాన్నగారు కూడా పాలకొల్లులోనే దిగమని చెప్పారు. వెరైటీగా ఉంటుందని ఇలా ప్లాన్ చేసుకున్నాను."

"మీకు ఆ ఏరియా గురించి సరీగ్గా తెలీదనుకుంటాను. నర్సాపురం వరకూ వెళ్ళటం దండగ. దాని ముందు స్టేషనే పాలకొల్లు. అక్కడ దిగితే 'చించి'నాడు వంతెన. అది దాటితే సఖినేటిపల్లి. పక్కనే ఎదుర్లంక"

ఆమె తలపట్టుకుని, "మా నాన్న పోలికలే మీకూ ఉన్నట్టున్నాయి. మీ ధ్యాస మీదే తప్ప అవతలివారు చెప్పేది వినరు. వెరయిటీగా ఉంటుందని చెప్పానుగా. గూగుల్ మ్యాప్ చూసాను. రైల్లో కాస్త ముందుకెళ్ళి నర్సాపురంలో దిగితే అక్కడి నుంచి అంతర్వేది పడవ, ఆ పై వెనక్కి సఖినేటిపల్లి వరకూ బస్సు, చివర్లో ఎడ్లబండి... ఇలా అన్ని రకాలూ ప్లాన్ చేసుకున్నాను" అంది.

ఆమె అలా చెప్తూ ఉండగా టికెట్ కలెక్టర్ లోపలికి వచ్చి, “ఇందులోకి ఇంకెవరూ రావటం లేదు మాడం. మీరు మార్చమంటే పక్క కూపే ఖాళీగా ఉంది” అన్నాడు.

“ఎందుకు? నాకేమీ ప్రాబ్లెమ్ లేదు. ఇక్కడ కంపెనీ ఉందిగా” అంటూ ఆదిత్య వైపు తిరిగి, “నీకేమయినా ఇబ్బందా?” అని అడిగింది. ఊహించని ఆ ప్రశ్నకి ఆదిత్య కంగారు పడి, “అబ్బే... లేదు లేదు” అన్నాడు.

ట్రెయిన్ వేగం పుంజుకుంది. కిటికీలో నుంచి బయటకు చూస్తూంటే ఆమెకి అమ్మ గుర్తొచ్చింది. అమ్మకి తెలుగంటే చాలా ఇష్టం. ‘రైల్లో వెళ్తూంటే రాత్రి పూట దూరంగా కనపడే దీపాలు, చెట్ల ఆకుల ప్రమిదల మీద వత్తులు వెలిగించి ప్రవాహంలో వదిలినట్టు ఉంటాయి’ అంటుంది. అమ్మా... నాన్నా... ఇద్దరూ మంచివాళ్ళే. తల్లి మంచి సంసారి. తండ్రి గొప్ప వ్యాపారి. కానీ ఇద్దరికీ మధ్య విభేదాల గోదారి.

“ఎదుర్లంకలో ఎవరింటికి?” ఆదిత్య అడిగిన ప్రశ్నకి ఈ లోకంలోకి వచ్చి “మా బాబాయి ఇంటికి” అంటూ వివరాలు చెప్పింది. అతడు కళ్ళు పెద్దవి చేసి దాదాపు అరుస్తున్నట్టు, “ఆయన మా టీచరు గారు”” అన్నాడు. ఒకరికొకరు మరికొన్ని వివరాలు తెలుసుకున్నాక, “మీరు డార్జిలింగ్‌లో ఉన్నారని ఆయన చెప్పేవాడు. అంత వరకే తెలుసు. అసలు ఎలా దూరం అయ్యారు?” అని అడిగాడు.

“ఏముంది? పెద్దలకి ఇష్టం లేని ప్రేమ వివాహం. అమ్మని తీసుకుని నాన్న డార్జిలింగ్ వచ్చేసాడు. ఆ పై అక్కడే టీ-ఎస్టేట్స్. కోట్లు సంపాదన. అమ్మ మాత్రం కోనసీమనీ, కల్చర్‌నీ మర్చిపోలేదు. మొన్నే బాబాయ్‌తో మాట్లాడి నన్ను తన దగ్గరికి పంపుతోంది. ‘కోనసీమ వెళ్తున్నావు. కోతి వేషాలు వెయ్యకు’ అని హెచ్చరించింది. అఫ్-కోర్స్ నాకూ ఉత్సాహంగానే ఉందనుకో.”

“నేను మిమ్మల్ని ‘మీరు’ అంటూంటే, మీరు నన్ను ‘నువ్వు’ అంటున్నారేమిటి?”

“ఇద్దరం ఒకే వయసు వాళ్ళం కదా. మీరూ-మీరూ ఏమిటి” అంటూ నవ్వింది. అతడికి ఎక్కడో ఏదో కదిలినట్టయింది. ఆమె వైపు చూసాడు. ఎత్తయిన కొండపై సెలయేరులా క్రిందికి జారిన అందం. క్రింద లోయలా లోతైన నాభి. అతడు బలవంతంగా కళ్ళు తిప్పుకున్నాడు. ఈ లోపులో ఆమె ముందుకు వంగి, “నీ వివరాలు చెప్పు. శలవులకి మావయ్య దగ్గరికి వెళ్తున్నావా? ఆయనకి కూతుర్లున్నారా?” అని కొంటెగా ప్రశ్నించింది.

“లేరు. అక్కడ ఉండి పోవటానికి వెళ్తున్నాను” సీరియస్ గా అన్నాడు.

“అదేమిటి?” అంది ఆశ్చర్యంగా.

“సరే. మొత్తం చెప్తా విను. నువ్వు మీ నాన్న గురించి చెప్తూ, ‘తన ధ్యాస తనదే తప్ప అవతలివారి మాట వినరు’ అన్నావు చూడు. మా ఇంట్లో పరిస్థితి కూడా అదే. మా తాత ఇంకా ఘోరం. ఇద్దరూ చేరో వైపూ కూర్చుని నాకు క్లాసు పీకుతారు.”

“ఎందుకు?”

“ఒకటని కాదు. థ్రిల్ కోసం ఏదో ఒకసారి సిగరెట్ తాగానని తెలిసి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు నాన్న. ఈ జుట్టు చూడు. ఇప్పుడు మా క్లాసులో అందరికీ ఇది ఫ్యాషన్. ఆడ సన్యాసుల్లా ఆ జడ ఏమిటి అంటాడు. ఒక్క రోజు గెడ్డం గీసుకోకపోతే ఇక ఆ రోజు ఇంట్లో యుద్ధమే. ఇక మా తాతయ్య అయితే తన జ్ఞానాన్నంతా నా మీద వొలక పోస్తాడు. కాస్త ఆవకాయ తింటే ఆరోగ్యం పాడవుతుందంటాడు. కంప్యూటర్ గేమ్స్ ఆడితే కాన్సంట్రేషన్ తగ్గుతుందంటాడు. ఎదురు తిరిగి ఇంకా ఏదైనా మాట్లాడితే ‘నా మీసం అంత అనుభవం లేదు’ అంటాడు. ఆ ఇంట్లో ఎవరూ నన్ను నాలా బ్రతకనివ్వరు అమ్మతో సహా..! భరించలేక వెళ్ళిపోతున్నాను.”

“పెద్ద వాళ్ళు అంతే” అన్నది ఆమె. మరో అయిదు నిముషాల సంభాషణ జరిగాక, “సిగరెట్ ఉందా?” అని అడిగింది. ఊహించని అతడు కంగారు పడి, “లేదు. లేదు. నేను రెగ్యులర్ గా తాగను” అన్నాడు.

"నేను తాగుతాను" అంది.

అతడు మాట్లాడలేదు. ఆమె ఫ్రెష్ రూమ్ కి వెళ్లింది. అతడు కిటికీలోంచి బయటకు చూసాడు. ట్రెయిన్ లేటుగా నడుస్తున్నట్టుంది. బీబీ నగర్ స్టేషన్ బోర్డు కనపడుతోంది. ఆమె లోపలికి వస్తూ, "అటెండర్ చెప్పాడు. నల్గొండ దగ్గర ఏదో ఆక్సిడెంట్ అనుకుంట. మరో రెండు గంటలు ఈ స్టేషన్ లోనే. అలా బయటకు వెళ్లి వద్దామా? రెండు గంటలు టైముంది కదా. వెళ్లి సిగరెట్లు కొనుక్కొద్దాం."

"నువ్వు రెగ్యులర్ గా సిగరెట్లు తాగుతావా?"

"నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?"

"నిజమే చెప్పు"

"రాత్రిళ్ళు కాస్త డ్రింక్ కూడా"

"పదహారేళ్ళకే డ్రింకా? అయినా ఈ అర్ధరాత్రి సిగరెట్లు ఎక్కడ దొరుకుతాయి?"

"వెతుకుదాం"

"మనం దిగాక ట్రయిన్ కదిలితే?"

ఆమెకు కోపం రాలేదు. నవ్వేసింది. "నీ ప్రశ్నలకి వరుసగా సమాధానాలు చెపుతాను విను. నేను పుట్టింది పెరిగింది హిల్-స్టేషన్స్ లో. అక్కడ డ్రగ్స్ తో సహా ఇవన్నీ మామూలే. అర్ధరాత్రి సిగరెట్లు ఎక్కడ దొరకుతాయన్నావు. వెతికితే కదా దొరికేది. ట్రెయిన్ వెళ్లి పోతే ఏమి చేస్తామన్నది నీ మూడో ప్రశ్న. పదివేలు పడేస్తే టాక్సీ వస్తుంది. అందులో వెళ్తాం. పాలకొల్లు రైల్వేస్టేషన్ కి ఫోన్ చేసి ఫలానా కంపార్ట్‌మెంటులో బ్యాగులున్నాయని చెప్తాం. వాళ్ళు తీసి పెడతారు. ఆ తరువాత జీవితాంతం ఈ అడ్వెంచర్ గురించే చెప్పుకుంటాం. అర్ధమయిందా? సరే. నేను వెళ్తున్నాను. నువ్వు వస్తే రా..."

ఇద్దరూ స్టేషన్ బయట కొచ్చి నడవటం మొదలుపెట్టారు. చుట్టూ చీకటి. గాలి బలంగా వీస్తోంది. అతడు నిశ్శబ్దంగా ఉండటం చూసి, "నా గురించి నీకు దాదాపు అంతా చెప్పేసాను. నువ్వు ఏమీ చెప్పలేదేమిటి?" అని అడిగింది.

"నేను ఇంట్లోంచి వచ్చేయ్యటానికి మరో కారణం కూడా వుంది. మా క్లాస్-మేటూ నేనూ ప్రేమించుకున్నాం. ఇళ్ళల్లో వప్పుకోవటం లేదు. బావిలో దూకుతానని అమ్మ ఎమోషనల్ గా బెదిరించింది. పెళ్ళికి వప్పుకోకపోతే ఆ ఇంట్లో ఉండనని నేను కూడా బెదిరించి వచ్చేసాను"

ఆమె కొద్ది సేపు మవునంగా ఉండి, "మంచి పని చేసావ్. ఈ పెద్దలు ఎప్పుడూ ఇంతే. ప్రేమని అర్థం చేసుకోరు. ఏమన్నా అంటే... 'చిన్నపిల్లవి నీకేం తెలుసు' అంటారు" అన్నది.

"నువ్వూ ఎవర్నైనా ప్రేమించావా?"

"నాకీ ప్రేమల మీద నమ్మకం లేదు బాస్. అనుభవించు-ఆనందించు అన్నది మన పాలసీ. పోతే... నాకు ఒకందుకు సంతోషంగా ఉంది. చాలామంది పిల్లలు తమ ప్రేమ వ్యవహారం ఇంట్లో చెప్పరు. రెక్కలొచ్చేవరకూ ఆగి, 'వప్పుకుంటారా? ఇంట్లోంచి వెళ్ళిపోమా?' అని బెదిరిస్తారు. మీరలా కాదు. ముందే చెప్పారు. అయితే ఒక అనుమానం. పెళ్లి చేసుకోవచ్చుగా. ఎందుకు ఆలస్యం?"

"ముందు స్థిరపడాలిగా. మా ఇద్దరికీ మంచి ఉద్యోగాలు వచ్చేవరకూ ఆగుదామని అనుకున్నాం. నెలకి చెరో యాభై వేలూ లేకపోతే ఎలా బ్రతుకుతాం చెప్పు? నా స్నేహితురాలు కూడా అదే అంటోంది"

"మీ ఆలోచన అక్షరాలా కరెక్ట్."

“మేము మిగతా ప్రేమికుల్లా కాదు. ఫ్యూచర్ థాట్ ఉంది. ఛాలెంజులు ఎదుర్కోటానికి సిద్ధంగా ఉన్నాం.”

“కానీ ఫ్రెష్ ఇంజనీర్లకి అంత జీతం రావటానికి కనీసం అయిదారు సంవత్సరాలు పట్టదూ?”

“ఆగుతాం. ఈ లోపులో వస్తే సరే సరి...”

“రాకపోతే?”

“మా తాత కూడా సరిగ్గా ఈ ప్రశ్నే అడిగాడు. ‘రాకపోతే మీరు చెప్పిన సంబంధమే చేసుకుంటా. లేదా బ్రహ్మచారి గా ఉండిపోతా’ అని చెప్పా. అమ్మా నాన్నలను బాగా చూసుకోవటమే నా ఆశయం.”

“నీ మాటలన్నీ కన్ఫ్యూజింగ్ గా ఉన్నాయి. ఒక వైపు ఇంట్లోంచి వెళ్లి పోతానంటావు. మరోవైపు అమ్మానాన్నల్ని బాగా చూసుకోవాలి అంటావు”.

“మంచి ఉద్యోగం వచ్చి పెళ్లి చేసుకున్నాక... పెద్దలు వాళ్ళే దిగి వస్తారు. అప్పుడు అందరం కలిసి ఉంటాం. పెద్ద జీతం రాకపోతే మాత్రం పెళ్లి చేసుకోము. స్నేహితుల్లా ఉంటాం. ఆ అమ్మాయి ఎవర్నైనా చేసుకుంటుందా... నాలాగే ఉండిపోతుందా... అన్నది తన ఇష్టం. ”

అతడి మాటలతో ఏకీభవిస్తున్నట్టు తలూపి, “మీరిద్దరూ అదృష్టవంతులు. పెళ్లికి ముందు డేటింగ్, రొమాన్స్ చాలా బావుంటుంది కదా. మా క్లాసులో చాలామంది అదే చేస్తారు. మంచి ఫ్రెండ్ ని ఎన్నుకుని ఎంజాయ్ చేస్తారు. ఆ తరువాత బుద్ధిగా పెద్దలు చూపించిన సంబంధం చేసుకుంటారు. ఆ అమ్మాయి మాత్రం ప్రెగ్నెన్సీ రాకుండా చూసుకోవాలి” అంది.

“ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు. మేము అంత నిగ్రహం లేని వాళ్ళం కాదు. మీ కల్చర్ వేరు. మాది వేరు.”

దానికి ఆమె తల అడ్డంగా ఊపుతూ, “ముందు అలాగే అనుకుని ప్రారంభం అవుతుంది. అనుభవం మీద చెపుతున్నాను. అయిదు సంవత్సరాలు కలిసి ఉంటారు కదా. ముందు చేతుల్లో చేతులు వేసుకోవటం, ఆ తరువాత బుగ్గ మీద ముద్దే కదా అని సర్దుకోవటం, శీలం పోనంత వరకూ పవిత్రత పోదు అనుకోవటం, ఆ తరువాత మరి కాస్త ముందుకి వెళ్ళటం... దీని కన్నా మా కల్చరే మంచిది కదా”

ఆ మాటలకి అప్పటి వరకూ పెరుగుతున్న అతడి ఆవేశం ఒక్కసారిగా అగ్నిపర్వతంలా బ్రద్దలైంది. “వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. ఏమిటి మీ కల్చరు? ఏం మంచిది? పధ్నాలుగేళ్ళకి సిగరెట్ మంచిదా? పదహారేళ్ళకే రొమాన్స్ మంచిదా? పైగా దాన్ని సమర్ధించుకుంటూ ఒక వాదనా? నిన్ను చూస్తూంటే జాలి వేస్తోంది. చూడూ... నేనూ నా అనుభవంతో చెపుతున్నాను. ఇలా బ్రతికితే పాతికేళ్ళకే జీవితం నిస్సారం అయిపోతుంది. శూన్యంగా బ్రతుకుతావు. చిన్నపిల్లవి. ఆలోచించుకో” అంటూ అతడింకా ఏదో చెప్పబోతూ ఉంటే ఆమె చూపుడు వేలు పైకెత్తి, “అదిగో షాపు” అంటూ అరుస్తూ అటు పరుగెత్తింది. అతను “అది మెడికల్ షాపు” అని అంటున్నా పట్టించుకోలేదు.

తిరిగి రావటానికి అయిదు నిముషాలు పట్టింది. “ఏమిటి ఆ షాపు వాడితో అంత వాదిస్తున్నావ్?” అని అడిగాడు.

“మెడికల్ షాపులో సిగరెట్లు ఉండవ్ అంటూ వెకిలిగా నవ్వాడు. నిరోధ్ ఉందా అని అడిగాను. బిత్తరపోయాడు. అప్పుడు చూడాలి వాడి మొహం. ఓ అరడజను కొన్నాను” అంటూ, మారుతున్న అతడి ముఖ కవళికలు గమనించకుండా, “మా సీనియర్ చెప్తూ ఉంటుంది... ఆడపిల్లల బ్యాగ్ లో ఎప్పుడూ ఒక ప్యాకెట్ నిరోధ్, ఒక పెప్పర్ స్ప్రే ఉండాలట. ఇష్టమైతే మొదటిది, ఇష్టం లేకపోతే రెండోది ఉపయోగించాలట. రెండూ రక్షణకే...”

అతడు అడ్డంగా నిస్పృహగా తల ఊపుతూ, “నీకస్సలు బుద్ధి లేదు. నువ్వీ జన్మలో బాగుపడవ్” అన్నాడు. ‘నిజమే. మా నాన్నా అదే అంటూ ఉంటారు’ అన్నట్టు ఆమె నవ్వేసింది. ఇద్దరూ వచ్చి కూర్చున్న అరగంటకి రైలు కదిలింది.

మరో గంట గడిచింది. అతడికి నిద్ర పట్టలేదు. పక్క బెర్త్ మీద పడుకున్న ఆమె కదలికలు చూస్తూ ఉంటే, ఆమెది కూడా తన పరిస్థితే అనిపించింది. ఆమె శరీరంలో ఆ ఇబ్బంది కదలిక తన సామీప్యం వల్లనో, డ్రింక్ లేకపోవటం వల్లనో తెలీదు. మొదటిదే కారణం అనుకున్నాడు. ఇంతలో ఆమె కుడిపక్క నుంచి వెల్లకిలా తిరిగింది. కంపార్టుమెంటు నీలి రంగు లైటు వెలుతురు కొండల మధ్య చంద్రకిరణంలా ఆమె మెడ క్రింద తళక్కున మెరిసింది. అందంతో పాటూ ఆ అమ్మాయి మాట తీరూ, ఈజ్, ముఖ్యంగా... బాడీలాంగ్వేజి లో ఒక స్టైల్ అతడిని ముగ్ధుణ్ణి చేసింది.

లేచి ఆమె దగ్గరకు వెళ్ళాడు.

ఆమె రెండు పెదవుల మధ్య సన్నటి ఖాళీ ఆహ్వానిస్తున్నట్టు కవ్విస్తోంది.

అతడు ముందుకు వంగి ఆమెని ముద్దు పెట్టుకోబోతూ ఉండగా కళ్ళు విప్పింది.

అతడు అలాగే ఆగి ఆమె వైపు చూస్తూ ఉండిపోయాడు.

అతడి ఆవేశపు ఊపిరి మొహానికి వెచ్చగా తగులుతోంది.

ఆమె మొహం పక్కకి తిప్పుకోలేదు.

అతడివైపే కన్నార్పకుండా చూస్తూ, స్పష్టమైన సన్నటి స్వరంతో "ఇదేనా మీ కల్చరు?" అంది.

...

ఆమె నిద్ర లేచే సరికి నరసాపురం వస్తోంది. అతడింకా క్యాబిన్ లో ఉండటం చూసి, "అదేమిటి? పాలకొల్లులో దిగలేదా?" అని ఆశ్చర్యంగా అడిగింది. అతడు సమాధానం చెప్పలేదు. రాత్రంతా నిద్ర లేనట్టు అతడి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆమె ఫ్రెష్ అయ్యేసరికి నరసాపురం వచ్చింది. కారుని అక్కడి వరకూ రమ్మన్నట్టున్నాడు. స్టేషన్ బయట అది రెడీగా ఉంది. అందులో రేవు వరకూ వెళ్లి, అవతలి గట్టు పడవ ఎక్కారు. వశిష్ట గోదారి సముద్రంలో కలిసే చోటు అంతర్వేది. పడవ నెమ్మదిగా వెళ్తోంది. చల్లటి గాలి తెరలు తెరలుగా వస్తోంది. అప్పటి వరకూ మాట్లాడని ఆదిత్య అప్పుడు నోరు విప్పాడు.

"రాత్రంతా ఆలోచించాను. నిన్నటి చర్యకి సిగ్గు పడుతున్నాననీ, నిన్న రాత్రి నీ ఒక్క మాటతో గొప్పగా మారిపోయాననీ... పెద్ద పెద్ద డైలాగులు వాడను. అసలు నేను చెప్పదల్చుకున్నది కూడా అది కాదు. నాకు కారవాన్ సినిమా గుర్తొస్తోంది. నువ్వు నాకన్నా జస్ట్ నాలుగైదేళ్ళు చిన్నదానివి. అయినా నువ్వు సిగరెట్ తాగుతూంటే నాకు నేనే పెద్దరికం ఆపాదించుకుని "పదహారేళ్ళ వయసులో సిగరెట్లేమిటి" అని తిట్టాను. అదే... నాకన్నా యాభై ఏళ్ళు పెద్దయిన తాతయ్య 'కాణీకి రికాణా లేకుండా ప్రేమించటం ఏమిటని' తిడితే భరించ లేకపోయాను. మెచ్యూరిటీ అనేది ఎంత రిలేటివ్ టర్మ్..! బ్యాగులో నిరోధ్ పెట్టుకునే నీ కల్చర్ నాకు హీనంగా తోచింది. ఇరవై నాలుగు నెలల క్రితం పరిచయమైన అమ్మాయి కోసం ఇరవై నాలుగేళ్ళు పెంచిన అమ్మని వదిలేద్దామనుకున్న నా కల్చర్ దాని కన్నా ఏవిధంగా గొప్పదో నాకు అర్థం కావటం లేదు. ఇది చెప్పటానికే పాలకొల్లులో దిగకుండా ఇక్కడి వరకూ వచ్చాను".

ఆమె కళ్ళు విప్పారితమయ్యాయి. మనసులో భావాన్ని అంత చక్కగా చెప్పినందుకో, ఆ నిజాయితీకో ఫిదా అయినట్టు అభినందన పూర్వకంగా అతడి వైపు చూసింది.

"సమస్యకి పరిష్కారం వెతకటం వేరు. సమస్య నుంచి పారిపోవటం వేరు. నేను చేసింది అదే" అన్నాడతను. "...ఆర్థికంగా స్థిరపడ్డాక పెళ్లి చేసుకుందామనీ, అప్పటివరకూ ప..వి..త్రం..గా బ్రతుకుదామనీ నేనూ నా గర్ల్-ఫ్రెండూ తీసుకున్న నిర్ణయం ఎంత పెళుసైందో నిన్న రాత్రి నేను చేసిన పనితో అర్థమయింది. పెద్దలు రాజీకి రాకపోతే కలో గంజో తాగి బ్రతకాలా? ఇప్పుడే ఆరోగ్యంగా విడిపోవాలా? నా ఫ్రెండ్ తో చర్చిస్తాను."

"రాత్రి విషయం మర్చిపో ఆదిత్యా..!"

"ఇంకొక్క అనుమానం"

"చెప్పు"

"సిగరెట్లు, డ్రింకు... అంతా అబద్ధం కదూ"

"మన కథకి అది అంత అవసరం కాదనుకుంటున్నాను" నవ్వింది.

అతడు దాని గురించి మరి రెట్టించకుండా, "నేను నీకేం చెయ్యగలను? ఐ మీన్... గిఫ్ట్? ఏదో ఒకటి అడుగు ప్లీజ్. నా సంతృప్తి కోసం" అని అడిగాడు.

ఏమి అడగాలా అన్నట్టూ ఆమె ఒక క్షణం ఆలోచించింది. వాళ్ళని రేవులో దింపిన పడవ సరంగు అవతలి గట్టు గమ్యం చేరుకోవటానికి బలంగా తెడ్డు వేస్తూ ప్రవాహ వేగానికి ఎదురుగా వెళ్తున్నాడు. ఎదురు గాలి వీస్తూనే ఉంది. అయినా పడవ గమ్యం వైపు వెళ్తోంది.

"నన్ను తీసుకు వెళ్ళటానికి మా నాన్న వస్తాడు. నన్ను సైకాలజీ చదివించటానికి ఆయన్ని వప్పించమని మీ మాస్టారుగారికి చెప్పు. అదే నువ్వు చెయ్యగల సాయం" అన్నది సుమద్యుతి.

★★★

(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)